క్లుప్తంగా

బురద జల్లితే సహించం

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపైన ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు బురద జల్లుడు కార్యక్రమం ఆపక పోతే తామూ అంతే స్థాయిలో స్పందించవలసి వస్తుందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పీజే జవహర్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, కార్యదర్శి బీవీఎస్ రవిశంకర్ హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటం చేస్తామని జవహర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎన్‌జీవో సంఘం నాయకులు వారికి ప్రభుత్వం కేటాయించిన భవనాలను వ్యాపార కేంద్రాలుగా మార్చి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి జమా ఖర్చులు కూడా చూపించడం లేదని అన్నారు. ఈ విషయం అడిగినందుకు తమపై ఎదురు దాడి చేస్తున్నారని అన్నారు.

22 నుంచి మాఘ మాసోత్సవాలు



ఉషా ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి

అల్లిపురం: వెంకటకేశ్వరమెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో జనవరి 22వ తేదీ నుంచి మాఘ మాసోత్సవాలు ప్రారంభమవుతాయని అలిమేలు మంగమ్మ అమ్మవారి దేవాలయం అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు. ఈ ఏడాది 22, 29, 5, 12, 19 తేదీల్లో ఐదు ఆదివారాలు మాఘపు ఆదివారాలు వచ్చాయని పేర్కొన్నారు. 1వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం శ్రీ భూ సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 5వ తేదీన మాఘ పౌర్ణమి, మూడవ ఆదివారం కావటం విశేషమన్నారు. 22వ తేదీ తెల్లవారు జామున 5 గంటల నుంచి ఛాయా ఉషాదేవి సమేత సూర్యనారాయణస్వామి వారికి విశేష పంచామృతాభిషేకాలు చేపట్టి అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన

ఎంవీపీ కాలనీ: ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను సమత కళాశాల కరస్పాండెంట్ విజయరవీంద్ర అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పురుషుల జట్టు ఇటీవల జరిగిన ఈ పోటీల్లో 3వ స్థానంలో సాధించిన విషయం తెలిసిందే. ఈ జట్టుకు ఎంవీపీ కాలనీలోని సమత కళాశాల క్రీడాకారుడు జి.వీర్రాజు సారథ్యం వహించగా.. కళాశాలకు చెందిన పి.యజ్ఞ సాయి, జె.రవి, పి.గోపీకృష్ణ టీం సభ్యులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విజయరవీంద్ర ఆయా క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం పరస రేపు

సీతంపేట: గౌరీ సేవా సంఘం అక్కయ్యపాలెం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వేంకటేశ్వర స్వామి, సీతారాముల వారి పరస మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం అక్కయ్యపాలెం మూడు గుళ్ల వద్ద సంఘ మాజీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆరోజు ఉదయం 5 గంటలకు అమ్మవార్ల ప్రథమ పూజతో పరస ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు తప్పెట గుళ్లు, సేవా గరిడీలు, కోలాటం వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణతో కనుల పండువగా జరుగుతుందన్నారు. ప్రజలంతా అమ్మవార్లను దర్శించుకుని పరసను జయప్రదం చేయాలని కోరారు.

ఆహ్లాదంగా.. ఆధునికంగా..

- నగరానికి మరింత వన్నె తెచ్చేలా రూపుదిద్దుకుంటున్న ఉద్యానవనం
- బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో స్నీపర్ పార్కు నిర్మాణం
- రూ.2.5 కోట్లతో శరవేగంగా పనులు



పార్కులో వాకింగ్ ట్రాక్

సీతమ్మధార: అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా మరో పార్కు రూపుదిద్దుకుంటోంది. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని, మానసిక ప్రశాంతతను అందించేలా ఉద్యానవనం సిద్ధమవుతోంది. జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో స్నీపర్ పార్కు(రాకెట్ పార్కు) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందరికీ అనువుగా.. అన్ని సదుపాయాలతో ఈ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని ఖాళీగా ఉన్న జీవీఎంసీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ జనరల్ ఫండ్స్ రూ.2.5 కోట్లతో స్నీపర్ పార్కును సిద్ధం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే దీనిని ప్రారంభించనున్నారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో నిర్మిస్తున్న స్నీపర్ పార్కు

పార్కు ప్రత్యేకతలు..

నగరంలో ఒక ప్రత్యేకమైనదిగా అన్ని హంగులతో స్నీపర్ పార్కును నిర్మిస్తున్నారు. ఇందులో నాలుగు వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా నాలుగు, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యానం, యోగా కేంద్రాలు, యాంపీ థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ ఏర్పాటు చేశారు. స్థానికులందరూ ప్రతి రోజూ వాకింగ్ చేసేలా ఇసుకతో ట్రాక్ తయారు చేశారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట సామగ్రితోపాటు ఆధునిక



ఆధునిక జిమ్, ఆట పరికరాలు

జిమ్ పరికరాలను అందుబాటులో ఉంచారు. పార్కు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుంది. అన్ని వసతులతో పార్కును నిర్మించి ప్రారంభించనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పార్కు ప్రారంభం

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఆధునిక హంగులతో నిర్మిస్తున్న స్నీపర్ పార్కును మరికొద్ది రోజుల్లో ప్రారంభిస్తాం. మొక్కలు నాటాల్సి ఉంది. అది పూర్తయితే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం

– శ్రీనివాస్, ఈఈ, జీవీఎంసీ

ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా..

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో చక్కటి వాతావరణంలో స్నీపర్ పార్కును ఏర్పాటు చేస్తున్నాం. పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులు సేదతీరేందుకు వీలుగా ఉంటుంది. త్వరలోనే ప్రారంభిస్తాం.

– కె.అనిల్‌కుమార్‌రాజు, కార్పొరేటర్, 14వ వార్డు

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



తోపుడు బండిని తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె. శివ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన జోన్ పరిధిలోని పూర్ణామార్కెట్ దరి తోపుడు బండ్లను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపారులతో మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశాల మేరకు నగర సుందరీకణ, మానవవాళి రక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు తెలిపారు. గుడ్డ సంచులు, నారసంచులు ఉపయోగించుకోవాలన్నారు. దుకాణాల్లో నిషేధిత కవర్లు ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతే కాకుండా అటువంటి వ్యాపారుల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. అనంతరం వార్డులో పర్యటించిన ఆయన రహదారులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడా చెత్త కనిపించకుండా యార్డుకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాసోత్సవాలు



అన్నసమారాధనలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గత నెల 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా ఆయనకు ఆలయ ఈవో కె.పద్మావతి, ఉత్సవ కమిటీ సభ్యులు అడారి వెంకట మహేష్, బొడ్డేటి ప్రసాద్, బొడ్డేటి కిషోర్ కుమార్, కర్రి నీలకంఠం, యల్లంకి చిన్నమ్మలు, కణితి గోవిందమ్మ, కొల్లి సత్యవతి, ఒమ్మి మోహనరావు స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యేకు శ్రీవారి శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. దాదాపు 3 వేల మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ధనుర్మాసోత్సవాలు, సనాతన పరస మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించినందుకుగా ఈవో పద్మావతితో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులను అభినందించారు.

చురుగ్గా సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్న గంట్ల శ్రీనుబాబు

మహారాణిపేట: జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఎన్‌జీవో హోమ్‌లో 2023కు సంబంధించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రీనుబాబు ప్రారంభించారు. 15 రోజుల పాటు విశాఖలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో వేర్వేరుగా సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించి త్వరలోనే ఇళ్ల స్థలాలు, హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా పాలసీలు అందజేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఫెడరేషన్ జాతీయ సభ్యుడు జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు కామాకుల మురళీకృష్ణ, కృష్ణమూర్తి, చింతా ప్రభాకరరావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు.

30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె



ఎల్ఐసీ సెంట్రల్ బ్యాంకు వద్ద నిరసన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

దాబాగార్డెన్స్ : యునైటెడ్ ఫోరమ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం బ్యాంక్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఎల్ఐసీ బిల్డింగ్ సెంట్రల్ బ్యాంక్ వద్ద కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమన్వయ సంఘం ప్రతినిధులు ఆర్‌వీ రవికుమార్, వి. కమలాకర్, వి. రమేష్ మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని, కొన్ని సవరణలతో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలన్నారు. 12వ ద్వైపాక్షిక వేతన సవరణ ఒప్పందం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. 11వ వేతన సవరణలో అమలు కాకుండా ఉన్న న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలంగా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు తెలిపారు. పి. ఈశ్వరరావు, టి. రాజు, బి. రామారెడ్డి, జి. సూర్యలక్ష్మి, ఎస్. అనూషభాను, కెఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి ఉమాదేవి

ఏయూ క్యాంపస్: అవగాహన, అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ సాధ్య పడుతుందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వాణిజ్య అధికారిఉమాదేవి చెప్పారు. శుక్రవారం సాయంత్రం బీచ్‌రోడ్డు లోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో విద్యార్థులకు ఇంట్లో గ్యాస్‌స్టవ్ వినియోగం–తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ స్టవ్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న పొరపాటు జరిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సంస్థ ప్రతినిధులు తేజ, మనోరమ పాల్గొన్నారు.

రైళ్ల పరిశుభ్రతకు సహకరించండి

- ప్రయాణికులకు డీఆర్ఎం విజ్ఞప్తి



డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైళ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని, ఇది అందరి బాధ్యతని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న వందేభారత్ రైలును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు హౌస్‌కీపింగ్ సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నా కూడా విశాఖకు చేరేసరికి పలు కోచ్‌ల నిండా ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ కప్స్, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేసి ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని చూసిన డీఆర్ఎం స్పందిస్తూ డోంట్ బీ బిట్టర్–స్టాప్ ద లిట్టర్ అని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతిష్టాత్మక వందేభారత్ రైలు శుభ్రంగా ఉంచాలని, దీనికోసం డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

చేసిన అభివృద్ధే బీజేపీని గెలిపిస్తుంది

దొండపర్తి : దేశాభివృద్ధికి ప్రధాన మంత్రి మోదీ చేపడుతున్న చర్యలే ఎన్నికల్లో తమ పార్టీని గెలుపిస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. బీజేపీ వైద్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మహారాణిపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం , కందిపప్పు నిత్యావసర సరకులపై కేంద్ర ప్రభుత్వం అధిక శాతం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై బీజేపీ రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు కేతినేని సురేంద్ర, పార్టీ నగర అధ్యక్షుడు ఎం.రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం: జీవీఎంసీ 32వ వార్డు చలువతోట, పాలసందు, నందివీధి ప్రాంతాల్లో డ్రైనేజీ పనులకు వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి కేటాయించిన అభివృద్ధి నిధుల నుంచి రూ.12 లక్షలతో ఈ పనులకు శంకుస్థాపన చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్‌పెక్టర్ పార్వతి, గిరిబాబు, ఉమ, అనిత, రాజు, ఆదిబాబు, కాంట్రాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వీసీటీపీఎల్ భద్రతా సిబ్బంది

తాటిచెట్లపాలెం: రహదారులపై ప్రయాణించేటపుడు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వీసీటీపీఎల్ సేఫ్టీ విభాగం సిబ్బంది సూచించారు. ఈమేరకు శుక్రవారం రైల్వే న్యూకాలనీ, స్టేషన్ రోడ్ జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు విధిగా సీట్‌బెల్ట్ ధరించాలని సిగ్నల్ పాయింట్ల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ, స్లోగన్‌ల ద్వారా తెలియజేశారు. ప్రజలంతా నిబంధనలు పాటించి ప్రమాద రహిత విశాఖకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీరి ప్రయత్నానికి ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు సంఘీభావం తెలిపి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవోతో పాటు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద'తో చక్కటి పౌష్టికాహారం



అచ్చియ్యమ్మపేట స్కూల్లో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న 34వ వార్డు కార్పొరేటర్ పద్మావతి



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే జగనన్న గోరుముద్ద ముఖ్య ఉద్దేశమని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. శుక్రవారం ఆమె అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని పౌష్టికాహారాన్ని రుచి చూశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందిస్తున్నారన్నారు. రోజుకో మెనూ చొప్పున విద్యార్థులకు చక్కటి ఆహారం అందిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు మెనూ అమలు చేస్తున్నారని అన్నారు. భోజనంతో పాటు గుడ్లు, వేరుసెనగపప్పు చెక్కీలు, బిర్యానీ, కిచిడీ, ఆకుకూర పప్పు, సాంబార్, స్వీట్ పొంగల్ పెడుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం ఆమె పాఠశాల ఆవరణలో జరుగుతున్న నాడు నేడు పథకంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, భాస్కరరావు, దుర్గారావు, సూరిబాబు, వైట్ తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లి దాతృత్వం



ప్రజాదర్బార్‌లో బాధితురాలికి ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



భూపేష్‌నగర్‌లో లివర్ వ్యాధితో బాధపడుతున్న షేక్ బాషాకు ఆర్థికసాయం చేస్తున్న వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రతి శుక్రవారం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన ఏర్పడుతోంది. శుక్రవారం 34వ వార్డు అచ్చియ్యమ్మపేటలోను, ఏవీఎన్ కాలేజీ దరి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెయిందొరపేటకు చెందిన రాగది దివ్య భర్తను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకుని ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి నిరాశ్రయురాలైన పిల్లి వరలక్ష్మి కుటుంబ పోషణ నిమిత్తం రూ.10 వేలు, 39వ వార్డు ఫెర్రీ రోడ్డులో నివసిస్తూ జీవనోపాధి లేక ఇబ్బంది పడుతున్న షేక్ ఖాజా మొహిద్దీన్‌కు రూ.2 వేలు, 36వ వార్డు గొడారి గోతులు ప్రాంతంలో నివసిస్తున్న నాగలాపల్లి వరలక్ష్మికి ఏక్సిడెంట్ అయిన కారణంగా ఆమెకు రూ.2 వేలు, 34వ వార్డులో లివర్ సమస్యతో బాధపడుతున్న భూపేష్‌నగర్‌కు చెందిన షేక్ బాషాకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొల్లి సింహాచలం, 36వ వార్డు ప్రెసిడెంట్ మాసిపోగు రాజు, నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్‌కేఎంఎల్ ట్రస్టీ వెంకటరత్నం, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, సురపతి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయండి మహాప్రభో..

- అధికారులకు పూర్ణామార్కెట్ వ్యాపారుల వేడుకోలు
- రహదారి సవ్యంగా లేక వ్యాపారం జరగడంలేదని ఆవేదన



రాళ్లు తేలిన దారిలోనే రాకపోకలు

జగదాంబ: నగరానికి ప్రధాన వాణిజ్య సముదాయం అయిన పూర్ణామార్కెట్ గతుకులు, రాళ్లు తేలిన రోడ్డుతో వ్యాపారులు, వినియోగదారులను హడలెత్తిస్తోంది. నగరంలో రైతుబజార్లు ఎన్ని ఉన్నా పూర్ణామార్కెట్‌లో సర్వం లభ్యం అవుతుండడంతో ఈ మార్కెట్ జనసంచారంతో నిండి ఉంటుంది. జీవీఎంసీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది కానీ పూర్ణామార్కెట్ రహదారిని మాత్రం విస్మరించడంతో రహదారి శిథిలమై నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

యూజీడీ సమస్య తీరినా..

పూర్ణామార్కెట్ రహదారి నిర్మాణానికి యూజీడీ సమస్యను బూచిగా చూపించి నిర్మాణం చేయలేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అయితే ఎట్టకేలకు యూజీడీ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమై నెలలు గడుస్తున్నా రహదారి నిర్మాణం చేయలేదని ఆరోపిస్తున్నారు. పూర్ణామార్కెట్ నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు ఏర్పడ్డ గతుకుల వలన వినియోగదారులు మార్కెట్‌కు రావడానికి భయపడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీని వలన తమకు వ్యాపారాలు జరగడంలేదని ఆవేదన చెందుతున్నారు.

దుకాణాల మీదకు రాళ్లు వస్తున్నాయి..



యూజీడీ సమస్య ఉన్నంత కాలం మురుగునీరు దుకాణాలపైకి తుల్లుతూ ఉండేది. ఇప్పుడు వాహనాల చక్రాల కింద పడ్డ రాళ్లు మాపై వచ్చి పడుతున్నాయి. రహదారి నిర్మాణం చేపట్టకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

–సత్యనారాయణ, తోపుడుబండి వ్యాపారి, పూర్ణామార్కెట్.

రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం



రోడ్డు నిర్మాణం అగిన మాట వాస్తవమే. అయితే మళ్లీ మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

–విల్లూరి భాస్కరరావు, 35వ వార్డు కార్పొరేటర్.